క్లుప్తంగా

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఏపీ ఐటీసీ వారి సహకారంతో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి కృష్ణ కశ్యప్ మాట్లాడారు. పాఠశాలలో చదువుతున్న 1 నుంచి 10వ తరగతి పిల్లలకు ఉచితంగా కంప్యూటర్ విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి నెలా విద్యార్థులలో పోటీతత్వం పెంచేందుకు కంప్యూటర్ పరిజ్ఞానంపై టెస్ట్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, నీరజ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి వెంబడి చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజాపురం గ్రామ శివారు ఉన్న చెత్త చెదారాన్ని అధికారులు బుధవారం తొలగించారు. 'రహదారి వెంబడి చెత్త'అనే శీర్షికన మంగళవారం సాక్షి కథనం ప్రచురణ చేసిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించి చెతాచెదారాన్ని పూర్తిగా తొలగించారు.

వైద్య శిబిరం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కళాశాల ఆవరణలో వంటశాలను, పరిసరాలను పరిశీలించి గురుకుల సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కవిత, హెచ్ఎస్ నాగేశ్వరరావు, వైద్య, గురుకుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడి మృతిపై సంతాపం

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రఫీక్ పాషా కొంత కాలంగా కేన్సర్‌తో బాధపడుతూ.. బుధవారం మృతి చెందారు. టీఆర్ఎస్ కార్యదర్శిగా తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన రఫీఖ్ మృతిపై ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, న్యాయవాది పానుగోటి కిషన్‌రావు తదితరులు సంతాపం ప్రకటించారు. అలాగే, సీపీఐ నాయకులు అయోధ్య, మున్నా లక్ష్మీకుమారితో పాటు జంగం మోహన్‌రావు, ఎస్‌కె సర్వర్, దుర్గ్యాల సుధాకర్, జంపాల శ్రీనివాస్, గాజుల నరేష్, ఎర్రోళ్ల అనిల్, దినేష్, ప్రవీణ్ నివాళులర్పించారు.

పథకాలను వివరించండి

చండ్రుగొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు ఆ పార్టీ అశ్వరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా ప్రసాదరావు సూచించారు. మండల కేంద్రం చండ్రుగొండలో బుధవారం ఆ పార్టీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ.. పార్టీ భరోసా యాత్ర ద్వారా కేంద్రప్రభుత్వ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి విశ్వేశ్వరయ్య, నిరంజన్‌దాస్, మండల నాయకులు గుగులోతు నీలవర్ణ, గుగులోతు రాజేష్‌నాయక్, బాణోత్ బాలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కరకగూడెం: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన కుంజా రంగయ్య ఇటీవల పలు అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. కాగా బుధవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేలను ఆర్థిక సాయంగా అందజేసారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఇర్ప విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు జాడి రామనాథం, బూర్గంపాడు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు కొమరం రాంబాబు, యూత్ ప్రెసిడెంట్ గుడ్ల రంజిత్ కుమార్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

దమ్మపేట: మండల కేంద్రంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావుకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం అందజేశారు. బుధవారం శివాలయ కమిటీ చైర్మన్ దారా రమేష్, సభ్యులతో కలిసి ఎమ్మెల్యేను ఆయన నివాసం తాటిసుబ్బన్నగూడెంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఉత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ములకలపల్లి మండల పరిధిలోని అల్లిగూడెం గ్రామానికి చెందిన మహిళలు తమ గ్రామానికి రోడ్డు వేయాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

చివరి భారం సర్కారుపైనే!

- ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి చివరి నిమిషంలో ప్రభుత్వ దవాఖానాకు..
- ప్రాణాలు కాపాడేందుకు శాయశక్తులా శ్రమిస్తున్న డాక్టర్లు
- కోలుకోలేక మృత్యువాత పడుతున్న కొందరు బాధితులు
- వెరసి ఏరియా ఆస్పత్రిలో పెరుగుతున్న మరణాల లెక్క



భద్రాచలం ఏరియా ఆస్పత్రి ..

భద్రాచలంఅర్బన్: 'మీకేం భయం లేదు... అంతా మేము చేసుకుంటాం. మాది అన్ని ప్రమాణాలు గల ఆస్పత్రి. ఇక్కడ పెద్ద పెద్ద డాక్టర్లుంటారు. పెద్ద నగరాల్లో ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇస్తున్న ట్రీట్మెంట్ అందిస్తాం'అంటూ రోగి వెంట వచ్చిన వారి కుటుంబ సభ్యులకు ప్రైవేటు ఆస్పత్రులు భరోసానిస్తుంటాయి. తీరా రోగికి సీరియస్ అయ్యేసరికి.. 'కండిషన్ సీరియస్‌గా ఉంది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లండి. లేకపోతే 'బతకడం కష్టం'అని చేతులు దులుపేసుకుంటున్నాయి. ఫలితంగా చివరి నిమిషంలో ఏరియా ఆస్పత్రి వచ్చి రోగులు చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందుతున్నారు. భద్రాచలం పట్టణంలో ఉన్న కొన్ని ప్రైవేటు ఆస్పత్రిల్లో ఏ రోగికి అయినా సీరియస్‌గా ఉందంటే వెంటనే భద్రాచలం ఏరియా ఆస్పత్రి మాత్రమే గుర్తు వస్తోంది.

ఈ కారణంగా ఆస్పత్రిలోని క్యాజువాలిటీ, ఇతర విభాగాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రతిరోజూ 500 నుంచి 600 మంది రోగులు ఓపీ సేవలకు. ఇన్‌పేషంట్లుగా నిత్యం 50 మంది దాకా ఉండటమే ఇందుకు నిదర్శనం. కొన్ని కొన్ని సార్లు అయితే బెడ్లు ఖాళీ లేక, ఏరియా ఆస్పత్రిలో అనారోగ్యంతో ఎవరైనా మృతి చెందితేనే వేరే వాళ్లకి బెడ్లు దొరికే పరిస్థితి ఉంది. చివరి నిమిషంలో ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వస్తున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఇలా వచ్చిన వారిని బతికించేందుకు ఇక్కడి వైద్యులు, సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. బాధితుల్లో కొంత మంది కోలుకోలేక మృత్యువాత పడుతున్నారు. భద్రాచలం చుట్టుపక్కల ఎక్కడ రోడ్డు ప్రమాదాలు, ఇతర ప్రమాదాలు జరిగినా క్షతగాత్రులను వెంటనే భద్రాచలం ఏరియా ఆస్పత్రికే తీసుకొస్తున్నారు. ఇందులో కొందరు ఆస్పత్రికి వచ్చిన కొద్దిసేపటికే మరణిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రిలో మరణాల సంఖ్య ఎక్కువ ఉండానికి దారితీరింది. అందులో భాగంగా భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నెలకు సగటున మరణాల సంఖ్య 30 నుంచి 35 ఉంటుంది. గతేడాది 590 మంది కోలుకోలేక మృతి చెందారు. వీరిలో పురుషులు 331 మంది, స్త్రీలు 259 మంది, చిన్నపిల్లలు 99 మంది ఉన్నారు.

ప్రాణాలు కాపాడేందుకు కృషి



చివరి నిమిషంలో వచ్చినా, అత్యవసర పరిస్థితుల్లో వచ్చినా రోగి ప్రాణాలు కాపాడేందుకే భద్రాచలం ఏరియా ఆస్పత్రి వైద్యులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. అహర్నిశలు శ్రమించి వారిని కాపాడేందుకు కృషి చేస్తున్నారు. కొంత మంది చివరి నిమిషంలో వచ్చి కూడా క్షేమంగా ఇంటికి వెళ్లిపోతున్నారు. కొందరు మాత్రం కోలుకో లేక మృతి చెందుతున్నారు. ఓపీ, ఐపీ రోగుల సంఖ్య ఎంత ఎక్కువ ఉన్నా గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఇక్కడ మరణాల సంఖ్య కూడా తక్కువగానే కనిపిస్తోంది. రానున్న రోజుల్లో భద్రాచలం ఏరియా ఆస్పత్రి సేవలను విస్తృతపరుస్తాం.

– డాక్టర్ రామకృష్ణ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, భద్రాచలం

క్రీడా స్ఫూర్తితోనే విజయాలు



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డీన్ డాక్టర్ మాధవి

అశ్వారావుపేటరూరల్: క్రీడా స్ఫూర్తితోనే పోటీల్లో విజయానికి సోపానమని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి అన్నారు. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోగల ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ కళాశాల క్రీడా పోటీల్లో అశ్వారావుపేట కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్, వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..క్రీడా పోటీల్లో గెలుపు ఓటమి సహజమేనని అన్నారు. స్థానిక కళాశాల నుంచి దాదాపు వందమంది విద్యార్థులు పలు రకాల క్రీడా పోటీల్లో పాల్గొంటే, అశ్వారావుపేట కళాశాలకే 110 బహుమతులు దక్కడం హర్షనీయమన్నారు. క్రీడా పోటీలతో పాటు పీజీ పరీక్షల్లో కుడా అశ్వారావుపేట విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉండటంతోపాటు, శాస్త్రవేత్తల నియామకాల్లో కూడా ప్రతిభ చాటి ఇతర కళాశాలలకు, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలబడ్డారని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులు అందుకున్న బహుమతులు, ట్రోఫీలు, జ్ఞాపికలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల శాస్త్రవేత్తలు మధుసూదనరెడ్డి, డాక్టర్ గోపాలకృష్ణ మూర్తి, డాక్టర్ సిద్దప్ప, డాక్టర్ నీలిమ, డాక్టర్ నాగాంజలి, డాక్టర్ శిరీష, పీడీ రెహమాన్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు సమస్య పరిష్కారం

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం గ్రామంలో నిర్మించవలసిన కల్వర్టు నిర్మాణ సమస్యను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి కలుగచేసుకుని బుధవారం పరిష్కరించారు. నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంలో భాగంగా కల్వర్టు నిర్మించాల్సి ఉండగా.. సంబంధిత కాంట్రాక్టర్ మాత్రం వేరే దగ్గర నిర్మించేందుకు సిద్ధం అయ్యారు. దీంతో గ్రామస్తులు విషయాన్ని బీఆర్ఎస్ నాయకులకు తెలియచేయడంతో అధికారులతో మాట్లాడారు. గ్రామస్తులు కోరిన దగ్గరే కల్వర్టు నిర్మించేందకు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు కణితి రాముడు, దామెర్ల శ్రీనివాసరావు, కొత్త మల్లేష్, పోడియం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణితో ఉజ్వల భవిష్యత్



ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేసిన జీఎం

మణుగూరుటౌన్: సింగరేణి ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం మణుగూరు ఏరియాలోని మెడికల్ ఇన్‌వాలిడిటీ అయిన ఐదుగురు ఉద్యోగుల కుటుంబాలకు చెందిన డిపెండెంట్లకు, మరో మహిళా డిపెండెంట్‌కు ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి ఉద్యోగం గొప్ప వరమని అన్నారు. ఉద్యోగం పొందిన వారు క్రమశిక్షణతో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయడానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, పీకేటీసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, డీజీఎం పర్చేజ్ శ్రీనివాసమూర్తి, ఫైనాన్స్ మేనేజర్ అనురాధ, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, టీబీజీకేఎస్ యూనియన్ నాయకులు కాపా శివాజీ, సీనియర్ అసిస్టెంట్ ఏ.ఠాకూర్‌లు పాల్గొన్నారు.

మిల్లెట్ మీల్స్ ప్రారంభం



మిల్లెట్ మీల్స్ ప్యాకెట్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

దమ్మపేట: పోషక విలువలు పెంపొందించే మిల్లెట్ మీల్స్‌ను మండల పరిధిలోని మల్లారం, మల్కారం సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రారంభించినట్లు సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. బుధవారం దమ్మపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధ, శనివారాల్లో మిల్లెట్ మీల్స్‌ను అందించనున్నట్లు తెలిపారు. పోషకాహార లోపాన్ని అధిగమించడమే లక్ష్యంగా గర్భిణులకు 100 గ్రాములు, పిల్లలకు 50 గ్రాముల చొప్పన మిల్లెట్ మీల్స్ ఆహారంగా అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, సర్పంచ్ ఉయ్యాల చిన్నవెంకటేశ్వరరావు, ఎంపీఓ కృష్ణ, అబ్దుల్‌జిన్నా, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సేద్యంతో లాభాలు



రైతుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ అఫ్జల్‌బేగం

చండ్రుగొండ: ఆయిల్‌పాం సేద్యంతో అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ యండి.అఫ్జల్‌బేగం రైతులకు సూచించారు. మండలంలోని మద్దుకూరు గ్రామంలో చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల రైతులకు ఆయిల్‌పాం సేద్యంపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సేద్యంతో వచ్చే లాభాలను, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను వివరించారు. గతంలో పంట సేద్యం చేస్తున్న రైతులకు గ్యాప్‌ఫిల్లింగ్ కోసం మొక్కలు సరఫరా చేయాలని గోద్రెజ్ కంపెనీని సంప్రదించినట్లు ఆమె తెలిపారు. రైతుబంధు సమన్వయకర్త గాదే లింగయ్య, సర్పంచ్ పద్దం వినోద్, సొసైటీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ, ఏఓ వినయ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

అశ్వారావుపేటరూరల్: న్యాయ స్థానం తీర్పు కారణంగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను తక్షణమే కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని యూఎస్‌పీసీ (ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి) బాధ్యులు కోరారు.

స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు, పదోన్నతుల కోసం మూడు లక్షల మంది ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారని అన్నారు. పదోన్నతుల లేని కారణంగా ఉన్నత విద్యాలయాల్లో టీచర్ల కొరత ఏర్పడి, విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయని, ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో టీపీటీఎఫ్, యూటీఎఫ్, ఏటీఎఫ్, ఎస్టీఎఫ్ సంఘాల బాధ్యులు జి.లక్ష్మీనర్సు, టి.వీరేశ్వరరావు, కె.మాధవరెడ్డి, ఎస్.శ్రీనివాస్, కె.హరినాథ్‌బాబు ఉన్నారు.

పాదయాత్ర వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

అశ్వాపురం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికుల పాదయాత్రను పంచాయతీ కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు కోరారు. అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం పాదయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న జనగామ జిల్లా పాలకుర్తి మండలం సాకలి ఐలమ్మ గ్రామంల పాదయాత్ర మొదలైందని, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నదే డిమాండ్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు రామచంద్రయ్య, శివ, వెంకన్న, లక్ష్మి, మల్లెశ్వరి, పెంటయ్య, వెంకటయ్య, సరోజనమ్మ, శేషమ్మ, శ్రీను, రవి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పాటుపడాలి



కార్మికులకు రక్షణపై అవగాహన కల్పిస్తున్న జేవీ రమణ

మణుగూరుటౌన్: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏరియా రక్షణ అధికారి జేవీ రమణ అన్నారు. బుధవారం పీకేటీసీ–2 ఆవరణలో ఏర్పాటు చేసిన కార్మికుల రక్షణ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సెఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్, స్టాండర్డ్ ఆపరేషన్ ప్రోసిజర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో కార్మికులకు రక్షణపై అవగాహన కల్పించారు. రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరికరాల ధరించే విధానం గురించి వివరించారు. వాహనాలను నడిపే సమయంలో సెల్‌ఫోన్లు మాట్లాడవద్దని, రక్షణ బెల్టు ధరించాలని అన్నారు. ఈనెల 13నుంచి 27వరకు గనులు, డిపార్టుమెంట్స్‌లో నిర్వహిస్తున్న అగ్నిమాపక సాధనాల వినియోగం అవగాహన పక్షోత్సవాల కార్యక్రమాలపై అవగాహణ కల్పించారు. అందరిచేత సామూహిక రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమలో పీకే ఓసీ ప్రాజెక్టు మేనేజర్ మాలోత్ రాముడు, రక్షణ అధికారి జి. శంకర్, సీనియర్ పీఒ ఎండీ మధార్‌సాహెబ్, అధికారులు భూక్యా బాంగ్యా, నాగేందర్, బి.బాబ్జి, కృష్ణమూర్తి, సూపర్‌వైజర్లు కె వెంకటేశ్వర్లు, సుకుమార్, గుర్తింపు సంఘం నేతలు ఐ శంకర్, సెఫ్టీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చర్ల ఎస్సై బాధ్యతల స్వీకరణ

చర్ల: ఏడూళ్లబయ్యారం నుంచి చర్లకు బదిలీపై వచ్చిన ఎస్సై టీవీఆర్ సూరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్సై రాజువర్మకు సీఐగా పదోన్నతి రావడవంతో ఆయన స్థానంలో ఏడూళ్ల బయ్యారంలో పని చేస్తున్న టీవీఆర్ సూరిని చర్లకు బదిలీ వచ్చారు. విధుల్లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రత పరిరక్షణకు ప్రజలు, ప్రజా సంఘాలు, పార్టీలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ బస్సులు

చండ్రుగొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని కొత్తగూడెం డిపో నుంచి ఆర్టీసీ బస్సుల ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయనున్నట్లు కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెనుబల్లి మండలంలోని నీలాద్రీశ్వరలాయానికి, అన్నపురెడ్డిపల్లి బస్సు సర్వీసులు నడిపిస్తామన్నారు. చండ్రుగొండ మండలంలోని కనకగిరి గుట్టలపై ఉన్న వీరభద్రస్వామి వద్దకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం బెండాలపాడు వరకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

18న ప్రత్యేక పూజలు

మణుగూరురూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని పీవీకాలనీలో ఉన్న చక్రసహిత రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ వారు బుధవారం తెలిపారు. 18వ తేదీ ఉదయం 5గంటల నుండి 11 గంటల వరకు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, బిల్వదలార్చన, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో పలు కార్యక్రమాలతోపాటు 19న సాయంత్రం 4గంటల నుంచి స్వామి వారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కల్యాణంలో కూర్చోదలచిన దంపతులు ముందుగా 9396497900, 9912994930 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

కంటి వెలుగు శిబిరంలో నాయకులు

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ సుందరయ్యనగర్ 16వ వార్డులో నిర్వహిస్తున్న కంటివెలుగు వైద్యశిబిరాన్ని బీఆర్ఎస్ నాయకులు బుధవారం సందర్శించి కంటి వైద్య పరీక్షల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు గంగారపు రమేష్, అడపా వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు డేగల సంపత్‌కుమార్, ఆకునూరు సతీష్, శ్రీను, వెంకటేశ్వర్లు, భూమయ్య, డాక్టర్లు బి.జ్యోతిలక్ష్మి, బి.దివ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రేవంత్ యాత్రతో నూతనోత్సాహం

బూర్గంపాడు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రతో పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోందని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బట్టా విజయ్‌గాంధీ అన్నారు. బుధవారం బూర్గంపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో రేవంత్‌రెడ్డి పాదయాత్రను దిగ్విజయం చేసిన కాంగ్రెస్ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సర్పంచ్‌లు పాయం వెంకటేశ్వర్లు, తాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైలు సకాలంలో బయలుదేరేలా చూడాలి

అశ్వాపురం: సికింద్రాబాద్ నుంచి మణుగూరు రావాల్సిన మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు సకాలంలో బయలుదేరేలా రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని మణుగూరు భారజల కర్మాగారం ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పాడ్య కేశవరావు కోరారు.బుధవారం ఆయన అశ్వాపురంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సికింద్రాబాద్‌లో రాత్రి 11.50 గంటల సమయంలో బయలుదేరాల్సిన మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు అర్ధరాత్రి దాటాక 2, 3 గంటలకు ప్లాట్‌ఫాం మీద పెడుతున్నారని, దీనివల్ల ప్రయాణికులు స్టేషన్‌లో మహిళలు, పిల్లలతో వేచి ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సేవాలాల్ జయంతి



అశ్వాపురం: బంజారా మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న రేగా సుధారాణి

బూర్గంపాడు: సంత్ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతిని అంజనాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్పీ జిల్లా నాయకులు కేవీ రమణ మాట్లాడుతు సేవాలాల బోధనలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూక్యా భారతి, భూక్యా సీతారాములు, ఇల్లందుల శేషు, సీతారామయ్య, బంజారా నాయకులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బంజారా నాయకుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సతీమణి సుధారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సుధారాణి బంజారా మహిళలతో కలిసి నృత్యాలు చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్ ఎంపీపీ వీరభద్రం, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణా రెడ్డి, చిలకా వెంకటరామయ్య, లంకెల రమేష్, ఎస్‌కే.నయీం, గడకారి రామకృష్ణ, తూము చిన రాఘవులు, సురేందర్‌రెడ్డి, జావీద్, జూపల్లి కిరణ్, బంజారాలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఇది రోడ్డేనా..?



మండలకేంద్రంలోని మన గ్రోమోర్ షాపు ఎదురుగా ఉన్న సీసీరోడ్డుపై మురుగునీరు చేరుతోంది. రోడ్డు పక్కన మురుగునీటి కాలువలోని మురికంతా ఈ రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో ఈ ప్రదేశంలో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు విలయతాండవం చేస్తున్నాయి. పైగా ఆ మురుగు నీటిపై నాచు, పిచ్చిమొక్కలు పెరిగాయి. ఈ పరిస్థితి పాదచారులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది. దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– ములకలపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: డి.లక్ష్మయ్య, మండల పంచాయతీ అధికారి, ములకలపల్లి
ఫోన్ నంబర్: 99634 06961